తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 49 | శనివారం 14.11. 2026 | పేజీలు :4 | వెల: 2



ప్రపంచ మేధోమథనానికి భాగ్యనగరం వేదిక!

భారత్ సమ్మిట్-2026 తొలిరోజు కీలక చర్చలు

'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు ప్రత్యేక సమావేశాలు

ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్రంగా చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్-2026' తొలిరోజు కార్యక్రమాలు శుక్రవారం విజయవం తంగా కొనసాగాయి. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు కీలక అంశాలపై ప్రత్యేక ప్యానల్ చర్చలు జరిగాయి. పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలపై దేశవిదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు, నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక సమానత్వం, సంక్షేమ పథకాల అమలు ప్రధాన చర్చనీయాంశాలుగా నిలిచాయి.

- 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు ప్రత్యేక సమావేశాలు
- ఫ్యూచర్ సిటీ, పట్టణాభివృద్ధిపై మంత్రి శ్రీధర్‌బాబు వివరణ
- ఆర్థిక, సామాజిక న్యాయం.. సంక్షేమ విధానాలపై చర్చలు
- తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలపై అంతర్జాతీయ ప్రతినిధుల దృష్టి
- రెండో రోజు సహకార సమాఖ్యవాదం, ఎన్నికల సమగ్రతపై చర్చలు
- నేడు హాజరుకానున్న రాహుల్‌గాంధీ

హైదరాబాద్ సూర్యోదయ వార్త

ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై సమగ్రంగా చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్-2026' తొలిరోజు కార్యక్రమాలు శుక్రవారం విజయవంతంగా కొనసాగాయి. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా 'తెలంగాణ రైజింగ్' ఇతివృత్తంతో నాలుగు కీలక అంశాలపై ప్రత్యేక ప్యానల్ చర్చలు జరిగాయి. పట్టణీకరణ, ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలపై దేశవిదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు, నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

రబీ కార్యాచరణ, పాఠశాలల అభివృద్ధిపై సీఎస్ సమీక్ష..



హైదరాబాద్ సూర్యోదయ వార్త

రాష్ట్రంలో రబీ పంటల సాగు కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించి, ప్రతి జిల్లాలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అనువైన పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయం నుంచి సీనియర్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, ఉద్యానవన శాఖ, సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం, కూరగాయలు, పప్పుధాన్యాల సాగు, ధాన్యం కొనుగోళ్లు, భూసేకరణ సమస్యలు, పాఠశాల విద్యా కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం ఎ. రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రధాన కార్యదర్శి వివరించారు. ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లందరినీ తమ తమ జిల్లాలకు టీమ్ లీడర్లుగా అభివర్ణించారని, ప్రభుత్వ ప్రాధాన్యతలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపై ఉందని తెలిపారు.రాబోయే రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి జిల్లాలో పంటల సాగుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేపట్టాలని తెలిపారు. రబీ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కూరగాయలు, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను గరిష్టంగా వినియోగించుకొని సాగు విస్తీర్ణం, ఉత్పాదకత పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సూక్ష్మ సేద్యం, ముఖ్యంగా బిందు సేద్యం విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని

పెట్టుబడులకు తెలంగాణే గమ్యం



ప్రపంచానికి చాటేందుకే భారత్ సమ్మిట్!

- రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం
- డిసెంబర్ 7 నుంచి ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- తెలంగాణకు విదేశీ ప్రతినిధులే బ్రాండ్ అంబాసిడర్లు కావాలి
- గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక విధానం
- రాహుల్‌గాంధీని ఆహ్వానించాం.. సదస్సుపై దుష్ప్రచారం తగదు
- 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం

2

నాడు మౌనం.. నేడు 100 కోట్లతో ప్రచారమా?



హైదరాబాద్: (త్రివర్ణ భూమి)

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గతంలో స్పందించని రాహుల్ గాంధీ.. ఇప్పుడు తెలంగాణ ప్రజల సొమ్ము రూ.100 కోట్లు ఖర్చు చేసి ప్రచార కార్యక్రమానికి ఎలా వస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల ఆందోళనలు, గిరిజన మహిళలపై దాడుల ఆరోపణలు, హైడ్రా కూల్చివేతలు, చెట్ల నరికివేత తదితర అంశాలను ప్రస్తావిస్తూ సోషల్ మీడియా వేదికగా ఘాటు విమర్శలు చేశారు.

మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా.. ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో కొట్టించినప్పుడు రాహుల్ గాంధీ ఎక్కడున్నారని ప్రశ్నించారు. లగచర్లలో గిరిజన మహిళలపై దాడులు చేసి, వారి దుస్తులు తొలగించి వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. కష్టపడి ఇళ్లు నిర్మించుకున్న తెలంగాణ ప్రజల నివాసాలను హైడ్రా బుల్డోజర్లు కూల్చివేస్తున్నప్పుడు ఢిల్లీలో నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలి హెచ్‌సీయూ భూముల్లో రాత్రికి రాత్రే 10 వేలకు పైగా చెట్లను నరికివేసి, జింకలు, నెమళ్లు సహా విలువైన పర్యావరణ వ్యవస్థను ధ్వంసం చేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదని విమర్శించారు. కేటీఆర్ పార్కు విధ్వంసంపై కూడా మౌనం వహించారని ఆరోపించారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

- భూగర్భ జలాల పరిస్థితిపై ఉత్తమ్ సమీక్ష ■15న మోదీతో భేటీ
- కేంద్రం నుంచి ప్రత్యేక ఆర్థిక సాయం కోరనున్న సీఎం, మంత్రి
- జల సంరక్షణకు తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలు



అండాల సేకరణ దందా గుట్టురట్టు

- ఫెర్టిలిటీ కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు
- బేగంపేట హాస్టల్‌లో 12 మంది మహిళలకు విముక్తి
- రూ.50 వేల ఆశచూపి ఇతర రాష్ట్రాల నుంచి తరలింపు
- ప్రమాదకర హార్మోన్ ఇంజెక్షన్లతో మహిళల ఆరోగ్యానికి ముప్పు



చలి పంజా విసురుతోంది

రాష్ట్రంలో రాత్రివేళ కనిష్ట ఉష్ణోగ్రతలు వేగంగా పతనమవుతున్నాయి. గత ఏడాదితో నవంబర్‌తో పోలిస్తే గురువారం తక్కువ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. గత నాలుగు రోజుల్లో సగటున 4--6 డిగ్రీల మేర తగ్గిపోయాయి. దీంతో ప్రజలు వణికిపోతున్నారు. హైదరాబాద్, సూర్యాపేట మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 11.3 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా చందనవెల్లిలో 11.4, వికారాబాద్ జిల్లా నవాబుపేటలో 11.7, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో 12.0, కుమ్రంభీం జిల్లా సిర్పూర్(యూ)లో 12.2, నాగర్‌కర్నూల్ జిల్లా తోటపల్లిలో 12.4, సిద్దిపేట జిల్లా కొండపాకలో 12.7, కామారెడ్డి జిల్లా గాందారిలో 12.7, సిరిసిల్ల జిల్లా గజసింగారంలో 12.8, మెదక్ జిల్లా చిలిపిచెడ్, నల్లగొండ జిల్లా గొడుకొండ్లలో 13.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.ఉత్తర దిశ నుంచి తక్కువ ఎత్తులో బలమైన చల్లని గాలులు రాష్ట్రం వైపు వీస్తుండడమే కారణమని ా వాతావరణ శాఖ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా వెల్లడించారు. మరో 2 వారాలు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు. అయితే పగటి ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణ స్థితిలో ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి తీవ్ర లోటు వర్షపాతం నమోదవడంతోపాటు పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటున్నాయి.

మహిళా కోటాపై కేంద్రం పట్టు

- మరోసారి డీలిమిటేషన్ బిల్లు!
- రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కేంద్రం కసరత్తు
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై చర్చ
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తామన్న ధీమా
- అవసరమైన మెజారిటీ కంటే 15-18 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా
- లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కి పెంచే ప్రతిపాదన

4



మోదీ నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు: రాహుల్ గాంధీ

- ప్రధాని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ
- ఆరోపణలకు ఆధారాలు ఫోన్‌లోనే ఉన్నాయని వ్యాఖ్య
- మోదీతో ముఖాముఖి చర్చకు మరోసారి సవాల్
- ఇన్‌స్టాగ్రామ్ ప్రశ్నోత్తరాల్లో రాహుల్ వ్యాఖ్యలు

2



తెలుగు దినపత్రిక
సూర్యోదయ వార్త
ప్రతి అక్షరం ప్రజల కోసం...

కార్యకర్త కుటుంబానికి కష్టకాలంలో తోడుగా కాంగ్రెస్ పార్టీ..

- మృతుడి కుటుంబానికి 75 కేజీల బియ్యం అందజేత....
- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకులు..



పినపాక. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. నవంబర్. 13.- (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పోలేబోయిన సీతారాం బాబు సోదరులు పోలేబోయిన ఆదినారాయణ. ఇటీవల మరణించగా, వారి దశదిన కర్మల నిమిత్తం శుక్రవారం కుటుంబ సభ్యులకు 75 కేజీల బియ్యాన్ని కాంగ్రెస్ నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమం పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సూచన మేరకు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ 25 కేజీలు, బియ్యం. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు చౌలం కేశవరావు.25 కేజీలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూనెం శ్యాం కుమారి 25 కేజీల బియ్యాన్ని అందజేసి బాధిత కుటుంబానికి తమ వంతు సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలోలిమండల నాయకులు షేక్ రఫీ , సతీష్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు...

విద్యార్థుల విద్య, నాణ్యమైన భోజనంపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి!

- పిల్లలతో కలిసి భోజనం చేసిన ముళ్ళకట్ట సర్పంచ్ ఈసం జనార్దన్.
- అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచ్.
- మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశం!.



ఏటూరునాగారం, ములుగు జిల్లా.నవంబర్ 13:(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ముళ్ళకట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను (ఎంపీపీఎస్) శుక్రవారం గ్రామ సర్పంచ్ ఈసం జనార్దన్ సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, ఆయాలకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి సర్పంచ్ భోజనం చేసి, భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పిల్లల విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి గ్రామ పంచాయతీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

రొయ్యూరు అభివృద్ధికి రూ.కోటి నిధులు..

- సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం!
- మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో గ్రామానికి మహర్దశ..
- గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న మంత్రి సీతక్క



ఏటూరునాగారం, ములుగు జిల్లా నవంబర్ 13: (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ అభివృద్ధి పనులకు శుక్రవారం స్థానిక సర్పంచ్ కావేరి అర్జున్ ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగి, పారిశుద్ధ్యం మెరుగుపడటంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందనున్నాయి. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

ఏజెన్సీ గ్రామాల్లో దోమల నివారణకు ఐటీడీఏ ప్రత్యేక కార్యాచరణ..

- నాలుగు గ్రామాల్లో దోమల మందు పిచికారీ.. ప్రజారోగ్యానికి పెద్దపీట..
- వ్యాధుల నివారణే లక్ష్యం..
- ఐటీడీఏ ఆదేశాలతో గ్రామాల్లో పారిశుధ్య చర్యలు.

ఏటూరునాగారం, ములుగు జిల్లా.నవంబర్ 13: (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

– ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణకు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ఐటీడీఏ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశాల మేరకు, ఐటీడీఏ ఏజెన్సీ డిప్యూటీ డీఎంహెచ్ఓ కోరం క్రాంతికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కొండాయి గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమం నిర్వహించారు. ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల, దొడ్ల, దొడ్ల కొత్తూరు గ్రామాల్లో



ఆరోగ్య సిబ్బంది పర్యటించి దోమల నివారణకు మందు పిచికారీ చేపట్టారు. గ్రామాల్లో దోమల వ్యాప్తిని తగ్గించి, ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యంగా వర్షాకాలం అనంతరం నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, మురుగు కాలువలు, దోమలు వృద్ధి చెందే ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమతెరలు వినియోగించడం, ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడటం వంటి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఐటీడీఏ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండాయి గ్రామ సర్పంచ్ ఆలం మానస, ఉపసర్పంచ్ పాయం సుబ్బయ్య, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావు, ఏఎన్ఎం సమ్మక్క, ఆశా కార్యకర్తలు లక్ష్మి, జ్యోతి, భాగ్యలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు..

సుజాతనగర్ మండలంలో 228 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే

మా లక్ష్యం: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావ

సుజాతనగర్ సూర్యోదయ వార్త నవంబర్ 13

: సుజాతనగర్ మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు నూతనంగా 228 చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. శుక్రవారం సుజాతనగర్ రైతు వేదికలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. పింఛన్లు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వారి నిత్యావసరాలకు ఆర్థిక సహాయంగా నిలుస్తాయని అన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీపీఐ కృషి

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రజా సమస్యల పరిష్కారం, పేద



ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పోరాటాలు నిర్వహిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రజల పక్షాన పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తోందని తెలిపారు.

సుజాతనగర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

సుజాతనగర్ మండలంలోని 13 గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, విద్య, ఇతర మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు ఆర్థిక భరోసా కల్పించిన ప్రభుత్వానికి, కృషి చేసిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె కె సాబీర్ పాషా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్, తహసీల్దార్ కృష్ణప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య దసురు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల రాములు, మండల సహాయ కార్యదర్శి తాళ్లూరి ధర్మారావు, లావుడియా గోపి, సర్పంచ్ ఉపేందర్, అరుణ నాయకులు, వీర్ల మల్లేష్, బొడ్డు కేశవరావు,దండు నాగేశ్వరరావు,దండు సురేష్, కుమారి కృష్ణ, ఆకుల వెంకన్న, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంతో ఒక వ్యక్తి జీవితం కాదు

- మొత్తం వ్యవస్థకే పెను ముప్పు...
- ప్రజాస్వామ్యం లో ఓటు మన వజ్రాయుధం,
- యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి...
- ములుగు జిల్లా సంక్షేమ అధికారి స్వీప్ నోడల్ ఆఫీసర్, ఇపి . ప్రేమలత...

వెంకటాపురం. నూగూరు. నవంబర్ 13 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాంగణంలో శుక్రవారం సంస్థ డైరెక్టర్ బ్రదర్ లూర్దు రాజ్ అధ్యక్షతన యువతకు డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ, అవగాహన కార్యక్రమం అథ్లెటిక్స్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి ఉ స్వీప్ నోడల్ ఆఫీసర్ ఇపి ప్రేమలత ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ –డ్రగ్స్ తో ఒక వ్యక్తి జీవితం కాదు, మొత్తం వ్యవస్థకే పెను ముప్పు అని అన్నారు. నేడు సమాజంలో జరిగే చాలా రకాల హింసకు కారణం డ్రగ్స్, మత్తు – మాదక ద్రవ్యాల వినియోగమే అని తెలిపారు. డ్రగ్స్ కి బానిసలైన వారు మానవత్వం మరిచి క్రూరంగా ప్రవర్తిస్తారని అన్నారు. నేటి యువతరమే దేశ భవిష్యత్తుకు పట్టుకొమ్మలు కావున యువతరం శారీరక శ్రమ, ఆరోగ్యవంతమై జీవన శైలి తోనే నిండు భవిష్యత్తును పొందాలని, తద్వారా క్రమ శిక్షణ, పట్టుదల మరియు అంకితభావం గల యువతను



కలిగి ఉన్న దేశంగా మనదేశ కీర్తిని ప్రపంచానికి చాటాలని సూచించారు.అనంతరం స్వీప్ అవగాహనలో భాగంగా ప్రజాస్వామ్యం లో ఓటు మన వజ్రాయుధమని, ఓటు హక్కు ప్రాముఖ్యత, సమాజ అభివృద్ధిలో ఓటు ప్రాధాన్యం, సక్రమం ఓటు వినియోగంలో యువత పాత్ర గూర్చి వివరించారు. ఓటు అర్హత వయస్సున్న ప్రతీ యువతీ యువకుడు ఓటరు నమోదు చేసుకోవాలని, అలాగే ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్క యువతీ, యువకులు ఓటు హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. యువత తలుచుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చు కావున ఓటు హక్కును వినియోగించుకొని సమర్థమైన నాయకత్వాన్ని ఎన్నుకుని దేశ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.అనంతరం ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన కాఫెడ్ సంస్థ డైరెక్టర్ బ్రదర్ లూర్దు రాజ్ మాట్లాడుతూ ఈ సమాజ దిశ, దశను మార్చే అద్వితీయమైన శక్తి యువతరానికి ఉందని, అలాంటి యువతరం మత్తు, మాదక ద్రవ్యాల మాయలో పడి తమ జీవితాలను నాశనం చేసుకోకుండా వారికి సరైన మార్గనిర్దేశం చేయడం కోసం మా కాఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో వెంకటాపురం ఉ వాజేడు మండలాలనుండి విచ్చేసిన యువకులకు ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే యువత మత్తు వైపు కాకుండా క్రీడలవైపు దృష్టి సారించి క్రీడా స్ఫూర్తితో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలనే సందేశంతో క్రీడా పోటీలను కూడా ఈ కార్యఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.అనంతరం స్థానిక వెంకటాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ – బాల్య వివాహ నిరోధక అధికారి ఆర్ . ఇందిరమ్మ బాల్య వివాహ నిషేధ చట్టం – 2006 లోని అంశాలను వివరించి బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని కోరారు.చివరగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ములుగు నుండి విచ్చేసిన ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్ . హరికృష్ణ మాట్లాడుతూ పి ఓ సి ఎస్ డి చట్టం – 2012 లోని అంశాలను సంపూర్ణంగా వివరించారు. యువత మైనర్ పిల్లల పట్ల ఎలా వ్యవహరించాలి అనే విషయాలను తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ యువకులుగా మన సామాజిక బాధ్యతని, చిన్నారులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 కి కాల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాఫెడ్ సంస్థకి చెందిన వెంకటాపురం ఉ వాజేడు మండలాల ఎన్యూమరేటర్లు – సిబ్బంది, వెంకటాపురం ఉ వాజేడు మండలాలనుండి విచ్చేసిన 400 పైగా మంది యువకులు తదితరులు పాల్గొన్నారు..

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

- నిరుపేదలకు అండగా ఉండడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..
- లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్. మొగిలిపల్లి రవీందర్.

తాడ్వాయి. ములుగు జిల్లా నవంబర్ 13 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– ములుగు జిల్లా తాడ్వాయి మండలం లింగాల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కొడిశెల . లింగాల గ్రామాల్లో శుక్రవారం నిరుపేద కుటుంబాల లబ్ధిదారులకు లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్. మొగిలి పల్లి రవీందర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ . మొగిలిపల్లి రవీందర్ మాట్లాడుతూ. నిరుపేద కుటుంబాలకు



అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడు స్మార్ట్ రేషన్ కార్డులను స్వధీనియోగం చేసుకోవాలని గ్రామపంచాయతీలో పరిధిలో మొత్తం 180 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందించినట్లు సర్పంచ్ రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మురళి. పీసా మొబలైజేర్ ఊ కే రవీందర్ గ్రామ ప్రజలు మొగిలి పెల్లి పాపారావు . పోలే బోయిన ప్రతాప్. పూనం అశోక్.మంకిడి నవీన్. లు పాల్గొన్నారు

ఎన్ని నిర్బంధాలు ఎదురు అయిన ఆదివాసి ఉద్యమం ను ఆపేది లేదు..

ములుగు కోర్ట్ కి హాజరు అయిన తుడుందెబ్బ

రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్ కుమార్ బృందం..



ములుగు. నవంబర్ 13 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

లంబాడీల కుట్రలో భాగంగా మేడారం లో నాటి గిరిజన మంత్రి చందూలాల్ పెట్టిన కేసులలో గత 10 సంవత్సరాలుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న కేసులో నేడు ములుగు జిల్లా కోర్టులో హియరింగ్ లో పాల్గొన్న నాయకులు.తుడుం దెబ్బ రాష్ట్రఅధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్..(ఏ ఎస్ యు) రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి.మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అర్రెం లచ్చు పటేల్.అధివాసి ఉద్యమ నాయకులు మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్. గొప్ప వీరయ్య ఆదివాసి ఉద్యమ నేత.బడే కృష్ణ అడ్వకేట్ గా బజారు శ్యాం ఉన్నారు లంబాడీలను ఎస్టీ ల నుండి తొలగించాలని ఉద్యమం లో అనేక కేసులు పాలు అయి నిత్యం కోర్ట్ ల చుట్టూ 20 ఏళ్లుగా తుడుందెబ్బ ఉద్యమ కారులు తిరుగుతున్నారని అయిన నేటికి పోరాటం ఆపటం లేదు అని రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ కుమార్ అన్నారు లక్ష్యం చేరే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు డిసెంబర్ – 9 కి పెద్ద ఎత్తున ఆదివాసీలు కదలి రావాలని పిలుపునిచ్చారు..

కిరాణా షాపుల్లో బియ్యం ధరల ఫ్లెక్సీల ఏర్పాటు...

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ..

ఏటూరు నాగారం. ములుగు జిల్లా. నవంబర్ 13 (సూర్యోదయ వార్త.)



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు కిరాణా దుకాణాల వద్ద బియ్యం ధరలను ప్రదర్శిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తహసిల్దార్ జగదీష్ ఆదేశాల మేరకు వ్యాపారులు విక్రయించే బియ్యం రకాల ధరలు వినియోగదారులకు స్పష్టంగా తెలిపేలా చర్యలు చేపట్టారు. ధరల విషయంలో పారదర్శకత పాటించాలని నిర్ణయిం చిన ధరల ప్రకారం విక్రయాలు జరపాలని అధికారులు సూచించారు. నిబంధనలో అతి క్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జ్వాలా చారిటబుల్ ట్రస్ట్. యూత్ మీడియా ఇన్‌చార్జిల నియామకం.

చేల నవీన్, ఉగ్గుమల్ల గణేష్ నియామకం..



మంగపేట. ములుగు జిల్లా. నవంబర్ 13 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

ములుగు జిల్లా మంగపేట మండలం జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఁ యూత్ మీడియా ఇన్‌చార్జిలుగా చేల నవీన్, ఉగ్గుమల్ల గణేష్‌లను నియమించినట్లు ట్రస్ట్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలకు మీడియా ప్రతినిధులకు తెలియజేయడంలో వీరు కీలక పాత్ర పోషించనున్నారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ,సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ముందుకు సాగుతోంది. మా సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర ఎంతో కీలకం. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరూ అంకితభావంతో పనిచేసి ట్రస్ట్ అభివృద్ధికి సహకరిస్తారని ఆశిస్తున్నాను” అని తెలిపారు.ఈ సందర్భంగా నూతన మీడియా ఇన్‌చార్జిలకు ట్రస్ట్ సభ్యులు అభినందనలు తెలియజేశారు...

కేజీబీవీ బాలికలకు హెచ్ పివి వ్యాక్సినేషన్..

డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో 14 ఏళ్ళు నిండిన 20 మంది బాలికలకు టీకాలు..



కన్నాయిగూడెం. ములుగు జిల్లా. నవంబర్. 13 (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో 14 ఏళ్ళు నిండిన 20 మంది అర్హులైన బాలికలకు టీకాలు వేశారు. ఈ వ్యాక్సిన్ భవిష్యత్తులో ముఖ ద్వారా క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుందని వైద్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అశ్విని. వైద్య. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత..

- **దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం..**
- **ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ..**
- **కుల, మత, వర్గ, వర్ణ, లింగ, ఆదాయ భేదాలు లేకుండా అన్ని కుటుంబాలకు వర్తింపు..**
- **నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా పథకం ప్రారంభం..**
- **గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలి..**
- **నవంబర్ 14 నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.**
- **అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పథకం అమలులో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.**
- **రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క..**

ములుగు.నవంబర్. 13- (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విధివిధానాలు, అమలు, నమోదు ప్రక్రియ, అవగాహన కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా, జీవిత బీమా భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని, ఇందుకు సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ప్రకటించినట్లు తెలిపారు.దేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కులం, మతం, వర్గం, లింగం, ఆదాయంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలోని ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హమేనని, అర్హులైన కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఇప్పటివరకు అమలులో ఉన్న వివిధ బీమా పథకాలు కొన్ని వర్గాలకు, కొన్ని శాఖలకు మాత్రమే పరిమితమయ్యాయని, అందుకు భిన్నంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించేలా ఈ



పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. దురదృష్టవశాత్తు కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు.నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

ప్రతి కుటుంబం వివరాలను నమోదు చేయాలి.

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ద్వారా సేకరించిన కుటుంబాల వివరాలు, పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో ఉన్న రేషన్ కార్డుల సమాచారాన్ని ఆధారంగా చేసుకొని నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను కూడా సర్వే సమాచారం ఆధారంగా పరిశీలించి, పథకం పరిధిలోకి తీసుకురావాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలు, వార్డులు, డివిజన్లలో అవసరానికి అనుగుణంగా ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి, కుటుంబాలన్నీ తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారునమోదు కేంద్రాల్లో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి, కుటుంబాల వివరాలను పరిశీలించి బీమా దరఖాస్తులను నమోదు చేయాలని తెలిపారు. నమోదు కేంద్రాల వివరాలు, తేదీలు, సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు.

నామినీల ఎంపికపై కుటుంబాలకు స్పష్టమైన అవగాహన కల్పించాలి.

బీమా పథకంలో నామినీల ఎంపికకు సంబంధించి కుటుంబాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బీమా మొత్తానికి ఒకరిని నామినీగా ఎంపిక చేసుకునే అవకాశం ఉండటంతో పాటు, ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకొని తమకు నచ్చిన విధంగా బీమా మొత్తాన్ని పంపిణీ చేసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు.దరఖాస్తులను పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అందులోని వివరాలను పూర్తిగా చదివి వినిపించి, వారికి అర్థమయ్యేలా వివరించిన తర్వాతే సంతకాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాము ఏ పథకం కోసం సంతకం చేస్తున్నారో, ఎవరిని నామినీలుగా ఎంపిక చేసుకున్నారో ప్రతి కుటుంబానికి స్పష్టంగా తెలియాలని ఆదేశించారు...

ప్రతి ఇంటికీ పథకం సమాచారం చేరాలి..

నవంబర్ 14 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని వార్డుల్లో ప్రతి కుటుంబానికి పథకం సమాచారం చేరేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించు కోవాలన్నారు. మీడియా ద్వారా పథకం లక్ష్యాలు, ప్రయోజనాలు, నమోదు విధానం, నామినీల ఎంపిక తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.నవంబర్ 17, 18 తేదీల్లో గ్రామాలు, పట్టణాల్లో పథకం అమలుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలన్నారు. అవసరమైన ప్రచార సామగ్రిని అందుబాటులో ఉంచి, ప్రతి కుటుంబానికి పథకంపై పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

పథకం అమలులో అత్యంత జాగ్రత్త వహించాలి..

దేశంలోనే తొలిసారిగా ఇటువంటి పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రతిష్ఠాత్మక పథకాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికార యంత్రాంగం పూర్తి నిబద్ధతతో పనిచేయాలన్నారు.పథకం విధివిధానాలు, నమోదు ప్రక్రియ, అమలును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు క్షుణ్ణంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పథకం ప్రయోజనం ప్రతి కుటుంబానికి చేరేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

- కుటుంబాల వివరాల నమోదులో ఖచ్చితత్వం పాటించాలి - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, కుటుంబాల జీవిత బీమా నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. నమోదు సమయంలో కుటుంబ సభ్యుల వివరాలు, బీమా ప్రయోజనం పొందే వారి వివరాలు, నామినీల సమాచారం ఖచ్చితంగా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని అధికారులకు సూచించారు.నవంబర్ 19 నుంచి తదుపరి 15 నుంచి 20 రోజుల వ్యవధిలో నమోదు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. పథకం విధివిధానాలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత శాఖల ద్వారా నివృత్తి చేసుకొని, అమలులో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ పథకం దేశంలోనే ప్రత్యేకమైనదని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ పూర్తి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, డీఆర్డీఓ రవీందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు...

మంగపేట మండలానికి బీసీ భవనం మంజూరు..

- **రూ. కోటి రూపాయల వ్యయంతో నిర్మాణం.**
- **మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు - చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు**
- **బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి**

మంగపేట,నవంబర్ 13: (సూర్యోదయ వార్త.)



ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో రూ.కోటి రూపాయల వ్యయంతో నూతన బీసీ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో,భవన నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ,బీసీ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం స్థానిక తహసీల్దార్ తోట రవీందర్ కు వినతిపత్రం సమర్పించారు..ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం బడుగు,బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి. డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో మంగపేట మండలంలోని బీసీల సంక్షేమం,అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని రూ.కోటి రూపాయల వ్యయంతో బీసీ భవనం మంజూరైందని పేర్కొన్నారు.బీసీ భవన నిర్మాణం పూర్తయితే మండలంలోని బీసీ వర్గాల ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు,సమావేశాలు నిర్వహించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అధికారులు త్వరితగతిన కేటాయించి,నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా సహకరించాలని కోరారు.ములుగు జిల్లాలోని మంగపేట మండలాన్ని అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల్లో ముందంజలో నిలిపేందుకు మంత్రి సీతక్క నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.మండలంలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేయిస్తున్నందుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,జిల్లా కార్యవర్గ సభ్యులు పాయం అనిత,ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యంపెల్లి వీరస్వామి,శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వైర్మన్ యర్రంగారి సురేష్,మండల ప్రధాన కార్యదర్శి చందర్లపాటి శ్రీనివాస్ రావు,మండల ఉపాధ్యక్షులు దామెర సారయ్య,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తుడి భగవాన్ రెడ్డి,మండల కోశాధికారి చాద మల్లయ్య, మండల ప్రచారకార్యదర్శి పల్లె శోభన్ బాబు,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బిలుపాటి నరేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శానం సత్యనారాయణ,బోడ బొర్రయ్య,పోట్రు సమ్మయ్య,ఎండి మహబూబ్ హుస్సేన్,మాటూరి పరమేష్, బట్ట రామారావు,దాసరి బుజ్జి,గడ్డం పరమేష్,బండపల్లి నరసయ్య,బూర్గుల సతీష్,పాయం గణేశ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి..

సర్పంచ్. పా రిక సరిత.

ఏటూరు నాగారం. నవంబర్. 13 (సూర్యోదయ వార్త.)

– ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రాంనగర్ గ్రామంలో వి బి జి రామ్ జి పథకం కింద మంజూరైన అంగన్వాడి కేంద్రం -2 భవనం నిర్మాణ పనులను సర్పంచ్ పా రిక సరిత పరిశీలించారు. డిసెంబర్ లోగా పనులు పూర్తి చేయాలని నాణ్యతలో ఎలాంటి లోపం లేకుండా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ . గార గాంధీ. వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి. రెడ్డి



లక్ష్మీనారాయణ. అంగన్వాడీ టీచర్. జి బి సిబ్బంది పాల్గొన్నారు.

కొండాయిలో రెండవ రోజు భూభారతి- రి సర్వే ..



ఏటూరు నాగారం. ములుగు జిల్లా.నవంబర్ 13- (సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి రెవిన్యూ గ్రామంలో రెండవ రోజు భూభారతి పథకంలో భాగంగా భూములు రీ సర్వే ఆ కార్యక్రమం నిర్వహించారు.. ఇందులో భాగంగా లైసెన్స్ దు సర్వేయర్లు వై ప్రభాకర్. అరుణ్ కుమార్. అంజలి. భూముల హద్దులను పరిశీలిస్తూ సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిపిఓ . కే గంగరాజు. రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు. రైతులు సర్వేకు సహకరించాలని అధికారులు సూచించారు.

వెంకటాపురంలో నాగుల చవితి వేడుకలు.



వెంకటాపురం. నూగూరు. నవంబర్ 13- (సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో శుక్రవారం నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పుట్టల వద్దకు చేరుకొని నాగేంద్ర స్వామికి పుట్టలో పాలు పోశారు. నాగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు శివశక్తుల పూనకాలతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ నాగుల చవితిని ఘనంగా నిర్వహించుకున్నారు.ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును ఛేదించిన ఎల్లారెడ్డిపేట పోలీసులు

ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును ఛేదించిన ఎల్లారెడ్డిపేట పోలీసులు



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో జరిగిన ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. పలు రాష్ట్రాల్లో ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి వెల్లడించారు.

2026 ఏప్రిల్ 11వ తేదీ తెల్లవారుజామున ఎల్లారెడ్డిపేటలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి, ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.6,06,100 నగదును చోరీ చేశారు. అంతేకాకుండా ఏటీఎం యంత్రాన్ని సైతం ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై హిటాచీ పేమెంట్స్ సర్వీసెస్ కంపెనీ ఛానల్ మేనేజర్ దాడిగల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర శాస్త్రీయ ఆధారాలను సేకరించి నిందితులను గుర్తించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన బహదూర్ చౌకీదార్ ప్రతబరామ్ బవారీ (36), గోపాల్ తేజారామ్ బవారీ (34)లను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వీరు గతంలో రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ఏటీఎం చోరీలకు పాల్పడినట్లు వెల్లడైంది. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.ఏటీఎం కేంద్రాలు, బ్యాంకులు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సేవే లక్ష్యం.. సమాజ మార్పే ధ్యేయంగా నేషనల్ సేవా ఫౌండేషన్ సేవలు

- మారుమూల గిరిజన గూడేల నుంచి వృద్ధాశ్రమాల వరకు
- భద్రాద్రి జిల్లాలో మూడు ప్రధాన సామాజిక సేవా కార్యక్రమాలు
- గిరిజన కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ
- పాఠశాల చిన్నారులకు విద్యా సామగ్రి, చిరుతిళ్లు
- వృద్ధులకు భోజనం, పండ్లు, దుస్తుల అందజేత





భద్రాద్రి జిల్లా ప్రతినిధి, నవంబర్ 12 (సూర్యోదయ వార్త)

సేవ చేయాలనే సంకల్పంతో, సమాజంలో మార్పు తీసుకురావాలనే తపనతో ప్రభుత్వ పథకాలు, అధికార యంత్రాంగం వెళ్లలేని చోటికి వెళ్లి అలాంటి వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో నేషనల్ సేవా ఫౌండేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. గిరిజన కుటుంబాలకు ఆప్యాయత పంచడం నుంచి చిన్నారుల విద్యాభివృద్ధికి తోడ్పడటం, వృద్ధులకు అండగా నిలవడం వరకు మూడు విభిన్న కార్యక్రమాలతో మానవీయతను చాటుకుంది.

###మారుమూల గిరిజన గూడేలకు ఆప్యాయత

చుంచుపల్లి మండలం పెనగడప గ్రామపంచాయతీ పరిధిలోని మర్రిగూడెం గుంపులో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాల్లో ప్రత్యేకంగా నిలిచింది. కేవలం 30 కుటుంబాలు మాత్రమే నివసించే ఈ మారుమూల ఆవాసం పట్టణ జీవనానికి దూరంగా ఉంది. కనీస వసతులు, అవసరాల కోసం స్థానికంగా లభించే వనరులపైనే ఆధారపడుతూ జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు ఫౌండేషన్ ప్రతినిధులు ఆప్యాయతతో చేయూతనిచ్చారు. వస్తువుల పంపిణీతోనే సేవను పరిమితం చేయకుండా, తదుపరి దశలో గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం విశేషం.

చిన్నారుల చదువుకు ప్రోత్సాహం

పాల్వంచ మండలం కారేగట్టు గ్రామంలోని ప్రీ-ప్రైమరీ పాఠశాల చిన్నారులకు పలకలు, బలపాలు, పుస్తకాలు, చిరుతిళ్లు పంపిణీ చేశారు. బాల్యంలోనే విద్యపై ఆసక్తి పెంపొందించడంతో పాటు పేద కుటుంబాల పిల్లలకు చదువుకు అవసరమైన ప్రాథమిక సామగ్రి అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపడమే కాకుండా, వారి విద్యాభివృద్ధికి సామాజిక సంస్థలు కూడా బాధ్యత తీసుకోవాలనే సందేశాన్ని ఫౌండేషన్ చాటింది.

వృద్ధులకు ఆత్మీయ భరోసా

అశ్వాపురం మండలంలోని వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు భోజనం సమకూర్చడంతో పాటు పండ్లు, చిరుతిళ్లు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కుటుంబాలకు దూరమై వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఆహారం అందించడం మాత్రమే కాకుండా, వారితో ఆత్మీయంగా గడుపుతూ ఆదరణ చూపడం ఈ కార్యక్రమంలో మానవీయ కోణాన్ని ఆవిష్కరించింది. షానాజ్ తన సొంత ఆర్థిక వనరులతో ఈ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ వృద్ధులకు ఆశ్రయం, ఆలనాపాలనా అందిస్తుండటం అభినందనీయమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

తొమ్మిది లక్ష్యాలతో సేవా ప్రస్థానం

ఈ సందర్భంగా నేషనల్ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు చిన్ని బాబు అరిగెల మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టిన ఈ కార్యక్రమాలు తమ సేవా ప్రయాణంలో తొలి అడుగులని తెలిపారు. సమాజంలోని అవసరంలో ఉన్న ప్రతి వర్గానికి చేరువ కావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్య, బాలల అభివృద్ధి, దివ్యాంగులు, వృద్ధులకు సహాయం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సంరక్షణ, యువతకు ఉపాధి నైపుణ్యాలు, మాదకద్రవ్యాల నివారణ, సేంద్రియ వ్యవసాయం, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ వంటి తొమ్మిది ప్రధాన అంశాలపై ఫౌండేషన్ పనిచేస్తుందని వివరించారు.

సమష్టి కృషితో సామాజిక మార్పు

ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ పి. శ్రీనివాసులు భరత అవినీతి నిరోధక, విజిలెన్స్ కౌన్సిల్ తెలంగాణ చీఫ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధాన కార్యదర్శి కనూరు శ్రీనివాస్‌తో కలిసి సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ట్రస్టీలుగా ఎం.కె. సిను, డాక్టర్ కె.వి.వి. వినీత, జి.ఎస్. జయధీర్, ఎం. జాన్ అరుల్, ఎస్. వీరభద్రరావు వ్యవహరిస్తున్నారు. న్యాయవాదులు ఈ. చంద్రకాంత్, మదన్ మోహన్, సింగం శ్రీధర్‌తో పాటు పి. గణేష్, దుర్గ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.

సేవా కార్యక్రమాలే సామాజిక బాధ్యతకు నిదర్శనం

సమాజంలో వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ సహాయంతో పాటు స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు కూడా ఎంతో అవసరం. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, కనీస అవసరాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో నేషనల్ సేవా ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాలు సేవా సంస్థల సామాజిక బాధ్యతను గుర్తుచేస్తున్నాయి. ఒక్కరోజు కార్యక్రమాలతో సరిపెట్టకుండా భవిష్యత్తులోనూ నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే మరింత మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరనుంది."నేడు సేవ.. రేపటి సాధికారత" (ూవతీజఅఎవ ఎశీఘ్నుఎ, జుఎజూశీఎవతీఅఅస్త్ర ఎశీఎశీతీతీశీఎ)లి అనే నినాదంతో సమాజంలో అర్థవంతమైన మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సేవను బాధ్యతగా, సమాజ అభివృద్ధిని ధ్యేయంగా చేసుకుని నేషనల్ సేవా ఫౌండేషన్ సాగిస్తున్న ప్రస్థానం అభినందనీయం.



